# ఎవరు బాధ్యులు?

— శుభ



అవర్ణ రీడింగ్ రూంలో అడుగు పెట్టింది.

ఒక మూల నలుగురు అమ్మాయిలు గుంపుగా కూర్చుని ఒకే పత్రిక చదువుతున్నారు. వాళ్ళు చదువుతున్న దేమిటో గ్రహించిన అవర్ణ ముఖం జేవురించింది. దృష్టి మరల్చుకుని ప్రక్కకి చూసింది.

ఏదో రానుకుంటున్న అనిత కనిపించింది. ఆమె ఎదురుగా—టేబుల్‌మీద తెరచివున్న పత్రిక ఉంది. ఆమె ఏం రాస్తోందో కూడా తెలుసు అవర్ణకు.

చర చర అక్కడకు వెళ్ళి ప్రక్క కుర్చీలో కూలబడుతూ "మళ్ళీ మొదలు పెట్టావూ?" అంది అవర్ణ చిరాకుగా.

రాస్తున్న ఉత్తరం కంగారుగా మూసేసింది అనిత. అయితే అవర్ణ ఒదిలిపెట్టే రకం కాదు. లాక్కుని చూసింది.

వారపత్రికలో లేఖలు శీర్షిక కోసం రాస్తున్న ఉత్తరం అది.

రంగను ప్రేమించిన రజిత—తల్లిదండ్రుల బలవంతం వల్ల పెళ్ళి చూపులకు కూర్చుంటుంది. రజిత యిష్టంలేని పెళ్ళి చేసుకుంటుందా? తల్లిదండ్రులు యింత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తారో! రంగ మరో దేవదాను అయిపోతాడా? అబ్బ, మా ఊహకు అందడం లేదు. రజిత జీవితం ఏమవుతుందోనని బెంగగా ఉంది"—అదీ ఉత్తర సారాంశం.

"ముక్కూ మొగమూ తెలీని రజిత కోసం బెంగ ఎందుకు బంగారు తల్లీ?! నీ బెంగను బంగాళా ఖాతంలో తొయ్యి! వెధవ. నంగిరాతలూ నువ్వూనూ!" కసిరింది అవర్ణ ఉత్తరాన్ని విసిరేస్తూ.

ఆ మూల కూర్చున్న అమ్మాయిలు యిటు చూసి ముసిముసిగా నవ్వుకుంటూ వుండటే బిర బిర అక్కడకు వెళ్ళింది అవర్ణ. చదువుతున్న వీక్లీ మూసేసి వాళ్ళు భయం భయంగా ముఖాలు చూసుకుంటూ ఉండిపోయారు.

వాళ్ళు చదువుతున్నదేమిటో—అవర్ణకు తెలుసు.

కుళ్ళు కాలువలో కూరుకుపోయిన రొట్టె ముక్క చుట్టూ మూగి ఆశగా చూసే బెగ్గర్స్‌లాగ—ఈ అమ్మాయిలు ఆ వారపత్రికలోని సెక్స్ కథమీద ముసురుతున్నారు.

కొంత కాలంగా సినిమాల్లో పొంగి పొరలుతున్న సెక్స్ యిప్పుడు పత్రికల్ని ముంచేస్తోంది. స్టూడెంట్స్ తమ పుస్తకాల మధ్య, తలగడల కింద పెట్టుకుని యివే రహస్యంగా చదువుతున్నారు.

అలాంటి వారపత్రికలు కాలేజీ కోసం కొనవద్దని ప్రిన్సిపాల్‌తో చెప్పి నిషేధింపజేసింది అవర్ణ. అయితే అమ్మాయిలు బయట కొని తెచ్చుకుని రీడింగ్ రూంలో—బెల్లం మీద ఈగల్లాగ మూగుతున్నారు!

"ఇక్కడ మేము పార్టై పోదలచుకున్నాం. మమ్మల్ని రక్షించనక్కరలేదు. వెళ్ళవమ్మా తల్లీ!" వేళాకోళంగా చేతులు జోడించి నమస్కరించింది ఒక అమ్మాయి.

"మిమ్మల్నీ ఈ దేశాన్నీ బాగు చేయడం నా తరం కాదే బాబూ!" అని వెనక్కి తిరిగి అనితను బయటకు లాక్కుపోయింది అవర్ణ.

అవర్ణ ఒక 'యాంగ్రీ యంగ్ వుమన్'. ఆమె వల్ల అందరికీ భయం! గౌరవం! అన్యాయాల్ని ప్రతిఘటిస్తుంది. అబలల్ని వెనకేసుకు వస్తుంది. నంగనాచుల్ని చీల్చి ఎండబెడుతుంది.

ఆమె వాగ్ధాటిని ఎదుర్కొనే సాహసం ఎవరికీ లేదు. ఒక దణ్ణం పెట్టేసి ఊరుకుంటారు.

జైలునుంచి తప్పించుకున్న ఒక నేరాల రాజా, అతని ప్రేయసి గురించి పత్రికలు సీరియల్స్ ప్రచురిస్తే—అందరూ ఓహో, ఆహా అంటూ లొట్టలేస్తూ ఆ చెత్తనంతా చదివే రోజుల్లో—

"ఒక ఖూనీ కోరు, రేపిస్ట్, గజదొంగ—వాడా మీ గ్రేట్ హీరో? సిటీ బస్సులో ఎవరైనా కాలు తొక్కితే తిట్టుకునే మీకు వీడా ఆదర్శవ్యక్తి!? ఇంటర్ చదివే పిల్లలున్న ఒక మునల్లి ఒళ్ళు కొవ్వెక్కి, డబ్బు కోసమో, ప్రచారం

కోసమో, కేవలం కామం తీర్చుకోడానికో—వాడితో చేయి కలిపితే—దానికి ఆధ్యాత్మిక ప్రేమ అని పేరు పెట్టి అర్థమైన రాతలూ రాస్తే, మీరేమో చెంగలు కార్చుకుంటూ చదవడం!! ఛీ... ఛీ..." అని విరుచుకు పడింది—అపర్ణ ఓరోజు.

కంటికెదురుగా కనిపించే అమ్మాయితో మాట్లాడలేని అర్భకులకోసం, ప్రేమించానని చెప్పే దమ్ముల్లేని దద్దమ్మల కోసం మరో పత్రిక "ప్రేమ పక్షులు" శీర్షిక ప్రారంభించగానే—

ఓహో, ఆహా అని ఊగిపోయారు ఆంధ్రపాఠకులు.

హంస రాయబారాలు, మేఘసందేశాలూ మరుగున పడిపోయి పత్రికా దౌత్యం ప్రారంభం అయింది. బొడ్డూడని ఆరో క్లాసు కుర్రాడు కూడా—తన క్లాసు అమ్మాయికే పత్రిక ద్వారా కాపీ ప్రేమ అందించే స్థాయికి ఎదిగిపోయాడు!

ఓహో, ఆంధ్రుల అదృష్టం! రాష్ట్రంలో ఎక్కడ చూసినా తెలుగు ప్రేమ పక్షులే! గుంపులు గుంపులు! గుట్టలు! గుట్టలు!!

అనిత కూడా రెండు మూడు పిట్టల్ని పట్టి ప్రేమ పాటలు మొదలు పెట్టింది—మారు పేరుతో!

అపర్ణ హెచ్చరిస్తూనే వుంది. ఆమె పోరుపడలేక ఉత్తరాల సంగతి చెప్పడమే మానేసింది అనిత.

నిజజీవితంలో యింటా బయటా ఏ పనిచేసినా గుర్తింపుకు నోచని అభాగ్యులు కొందరుంటారు—గుర్తింపు కోసం తహతహలాడుతూ—ఊహా ప్రపంచంలో జీవిస్తూ. వారికి జీవితం పట్ల అవగాహన కానీ, ఘనకార్యాలు సాధించే సమర్థతగానీ ఉండవు. అందుకే సాధారణమైన పనులను సైతం అసాధారణంగా చేస్తూ ప్రజల కళ్ళల్లో పడుతూ ఉంటారు.

అతివాగుడు, వెర్రివేషాలు, వింత హెయిర్ స్టయిల్స్, అర్థం పర్థంలేని ఉత్తరాలూ—యివన్నీ గుర్తింపు కోసమే. ఆ తహ తహ హద్దుల్లో వుంటే ఫర్వాలేదుగాని— హద్దు మీరితే మాత్రం అదొక జాడ్యమే.

ఆ మానసిక జాడ్యం యొక్క ప్రకోపమే—ఈ అనిత! ఏదో రాసేసి, మరేదో చేసేసి అచ్చులో పేరు చూసుకుని గుర్తింపు పొందాలని ఆమె ఆరాటం.

ఇలాంటి పాఠకుల కండూతిని, మానసిక రుగ్మతను పెంచి పోషించి నాలుగు రాళ్ళు సంపాదించుకునే పత్రికలు బయలుదేరాయి.

ఇలాంటి కుక్క గొడుగు పత్రికల మీదనే బాణం ఎక్కుపెడుతుంది అపర్ణ. సంపాదకులూ, సామాజిక బాధ్యత అంటూ తన తర్కంతో స్నేహితురాళ్ల ధోరణిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. అదీ అమ్మాయిల భయం. అందుకే ఆమెతో వాదనకు దిగరు. ఒక దణ్ణం పెట్టేసి వూరుకుంటారు.

అపర్ణ యిప్పుడు వాళ్ళతో వాదించే స్థితిలో లేదు. రీడింగ్ రూం నుంచి అనితను బర బర ఈడ్చుకొచ్చి సిటీ బస్‌స్టాప్ వద్ద అడిగింది—"రేపు నీకు పెళ్ళి చూపులు కదా! ఇల్లు సర్దుకోవడం గట్రా ఎన్నో పనులుంటాయి. పెందరాళే యింటికి అఘోరించక యిక్కడే ఉత్తరాలు రాస్తూ కూర్చున్నావా?"

"ప్రేమ పక్షులు" శీర్షిక ద్వారా పరిచయం అయి, ఉత్తరాల ద్వారా టన్నుల కొద్దీ 'తెలుగు ప్రేమ' కురిపించిన ముగ్గురిలో మొదటివాడే—రేపు పెళ్ళి చూపుల కొస్తున్న అనిల్.

"ఉత్తరాలద్వారా అనిల్ హృదయం నాకూ, నా హృదయం అతనికీ తేటతెలుగు అయిపోయింది! రేపు చూపులు ఉత్త ఫార్మాలిటీ!" అంది అనిత గొప్పగా.

'అమ్మాయిని చూసుకోడాన్కి రండహో' అంటూ చెప్పులరిగిపోయేట్టు యింటింటికీ తిరిగే బాధ తండ్రికి తప్పించాను. మీ అందరికంటే నేనే గొప్పదాన్ని—అన్న గర్వం ధ్వనించింది ఆమె స్వరంలో.

"తేటతెలుగు కాదే, నీ మొహం ఈడ్చా! తేటతెల్లం అనాలి! ఆ వచ్చే వాడు కూడా నీలాగే ఒక మానసిక రోగి కాబట్టి ఏబ్రాసి ముఖం వేసుకొని కూర్చుంటావన్నమాట పెళ్ళి చూపులకు!" పోపులో ఆవగింజలాగ చిటపటలాడింది అపర్ణ.

అపర్ణ ఎంత ఘాటుగా తిట్టినా అనిత ఏమి అనుకోదు. పైగా మరింత తిట్టించుకుని నవ్వుకుంటుంది.

అనితకు ఉత్తరాల పిచ్చి అయితే ఆమె తల్లి అన్నపూర్ణమ్మకి అతివాగుడు పిచ్చి! పైకి ఎంత డాంబికంగా కనిపించినా, ఏదైనా సమస్య ఎదురైతే మాత్రం యిద్దరికీ కాళ్ళూ చేతులూ ఆడవు.

కొంప కిష్కింధలా ఉంది. పెళ్ళి చూపులు ఎలా నిర్వహించాలో, ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో ఏమీ తెలియదు అన్నపూర్ణమ్మకి. ఎలాగో నెట్టుకు రావచ్చులే అని తాత్సారం చేసినా చివరకు దిక్కు తోచక అపర్ణని, ఆమె తల్లినీ బ్రతిమాలి యింటికి తీసుకువచ్చిందామె.

వాళ్ళే యిల్లు నీటుగా సర్ది పెట్టి ఏం చేయాలో, ఎలా చేయాలో రిహార్సల్ యిచ్చి చూపించారు.

సాయంకాలం నాలుగ్గంటలకు అనిల్ ఒక్కడే వచ్చాడు.

మర్యాదలూ, కుశల ప్రశ్నలూ అయాక సుతారంగా టిఫిన్ తింటూ ఇంటర్వ్యూ ప్రారంభించాడు అనిల్.

మనసులు కలబోసుకున్నాం—యిదీ, అదీ—అంటూ నిన్నంతా తెగ కబుర్లు చెప్పిన అనిత సాక్షాత్తూ ఆ ప్రేమ పక్షి ఎదుట కూర్చుని ప్రశ్నలడుగుతూంటే ఉలుకూపలుకూ లేకుండా తలవంచుకొని బొమ్మలాగ ఉండిపోయింది.

"మీకు నేనో పదిరూపాయిలిస్తే ఏం చేస్తారు?"

అనితనే ప్రశ్నించినా—అతని దృష్టి మాటి మాటికీ అపర్ణ మీద పడుతోంది. ఈ ప్రశ్నకూ అనిత జవాబు చెప్పలేదు. ఆమె బదులుగా అన్నపూర్ణమ్మ చెప్పింది "ఏం చేస్తుందీ? ఆ పదిరూపాయిలతో కార్డులూ, కవర్లూ కొని పత్రికలకు ఉత్తరాలు రాస్తుంది!"

గల గలా నవ్వుకున్నారందరూ.

"మీరు చెప్పండి" అపర్ణను అడిగాడు ఈసారి.

ఆమె ఉలిక్కి పడింది. అతని దృష్టి తరచుగా తన మీదకు ప్రసరించడం ఆమె గమనించక పోలేదు. ముఖం జేవురించింది. "సారీ, అప్లికేషన్ పెట్టని వారిని యింటర్వ్యూ చేయకూడదు!" అంది నవ్వేస్తూ.

ఆ సమయస్ఫూర్తి ఎంతగానో నచ్చిందతనికి. "ఫ్రెండ్లీగా చెప్పండి ప్లీజ్... నేను పదిరూపాయిలిస్తే మీరేం చేస్తారు?"

"పరిచయం లేని వ్యక్తి—పదిరూపాయిలిస్తే—చెప్పుచ్చుకుకొడతా" నిజంగా కొట్టినంత తీవ్రంగా ఛెళ్ళున చెప్పింది అపర్ణ.

అనిల్ నిర్ఘాంతపోయి, అంతలోనే సర్దుకుని నవ్వుకున్నాడు. ఆ నవ్వు చూసి చిర చిర లాడిపోయిలేచి అపర్ణ. అన్నపూర్ణమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా చరచరా తన యింటికి వెళ్ళిపోయింది.

* * *

మర్నాడు కాలేజీకి వెళ్ళడానికని సిటీబస్ కోసం ఎదురుచూస్తున్నప్పుడు—మిగిలిన విషయాలు ఉత్సాహంగా చెప్పుకొచ్చింది అనిత. ప్రేమ వివాహం కదా కట్నం ప్రసక్తి ఉండదనుకున్నారు కాని, ఆ విషయాలు మాట్లాడడానికి పెద్దల్ని పంపిస్తానని వెళ్ళిపోయాడట అనిల్!

"చవట!" కసిగా అనుకుంది అపర్ణ.

"హల్లో!"

ఆ స్వరం విని యిద్దరూ అటు తిరిగారు. నిన్ననే ఊరికి వెళ్ళిపోతానన్న పెద్ద మనిషి—అనిల్!

కాసేపు జోకులు చెప్పి తనే నవ్వుకుని 'కాస్త కాఫీ తాగి వద్దాం రండి'—అన్నాడు. అలాంటి ఆహ్వానం కోసమే ఎదురు చూస్తున్న దానిలా నువ్వు కూడా రావే—అన్నట్టు అపర్ణ వైపు చూసింది అనిత.

"కాలేజీ..." అని నసిగింది అపర్ణ.

అనిల్ బ్రతిమాలడం మొదలు పెట్టాడు. సరిగ్గా అప్పుడే బస్‌రావడంతో మరోమాటకు అవకాశం యివ్వకుండా బస్ ఎక్కేసింది అపర్ణ.

అతనితో ఒంటరిగా వెళ్ళాలా వద్దా అని కాసేపు తటపటాయించింది అనిత.

"మోహనరాగం"లో "కీర్తి" పెళ్ళి చూపులకు వచ్చిన హీరోతో షికార్లు కొట్టి అభాసుపాలైంది. "ప్రేమ వల్ల

కి''లో గీత షికార్లు కొట్టి హీరోని చెంగుకి కట్టుకుంది... ''ప్రేమలోతులు''లో లత...

ఇలాంటి సందర్భాలలో నవలా నాయికలు ఏం చేశారో ఆలోచిస్తూ ఉండగానే—బస్ వెళ్ళిపోయింది. అనిత అనిల్‌ని అనుసరించక తప్పలేదు.

మర్నాడు ఆ విషయాలన్నీ సగర్వంగా అపర్ణకు చెప్పుకుంది అనిత..

హొటల్ స్పెషల్ రూంలో ప్రక్క ప్రక్కనే కూర్చున్నారట. అతడు ఆమెకు టిఫిన్ తినిపించాడట... ఆమె తక్కువ తిన్నదా!!

తర్వాత నూన్‌షో... చిలిపి చేష్టలు...

''ఖర్చువాడిదా? నీదా?'' వెటకారంగా అడిగింది అపర్ణ.

అనిత జవాబు చెప్పలేదు.

''ఒసే పిదత ముఖమా! పెళ్ళికాకుండా యిలాంటి పన్లు చేస్తే లోకువ అయిపోతావు సుమా'' అని హెచ్చరించింది అపర్ణ.

''ప్రేమ లోతుల్లో లత యిలాగే ఉత్తరాల ద్వారా కానీ కట్నం యివ్వకుండా రాజాలాంటి మొగుడ్ని సంపాదించుకుంది తెలుసా?'' అంది అనిత.

''అది నవల! ఇది జీవితం!'' ఖస్సుమంది అపర్ణ.

''జీవితమే ఒక నవల!'' కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంది అనిత. దాని వాటం చూసి మూతి మీద వాత పెట్టాలనిపించింది అపర్ణకు.

ఆమెకు అనిత ఒక మానసిక రోగిలాగ కనిపిస్తే—

### మంచి ముద్రలు

అనంతమైన
కాల జలధిలో
మనిషి మజిలీ
గుక్కెడు నీళ్ళు!
అందుకే—
చేద్దామనుకుంటున్న
మంచిపనులేవో
తొందరపడి చేసేసెయ్!
మనిషై పుట్టినందుకు
మంచిని పెంచే ముద్రలెన్నో
తొందరపడి వేసేసెయ్!

—విమలా రామం

అనితకు అపర్ణ ఒక అమ్మమ్మ లాగ కనిపించింది!

* * *

పెళ్ళి ఫెళ్ళున జరిగిపోయింది.

తమ పరిచయం, ప్రణయం, వివాహం గురించి వివరిస్తూ పత్రికకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ కలర్ ఫోటో పంపారు దంపతులు. ఆ ఫోటోని ముఖచిత్రంగా ముద్రించి సంచలనం సృష్టించింది ఆ పత్రిక.

ప్రేమ పక్షుల విజయం! పత్రిక చేసిన పెళ్ళి! చరిత్ర సృష్టించిన శీర్షిక! అంటూ పాఠకులు ఓహోకారాలూ, హాహాకారాలూ చేశారు!

వాటి ఫోటోలు ప్రచురించి మరింత ప్రచారం చేసుకుంది ఆ పత్రిక. ఏనుగు ఎక్కినట్లు సంబర పడిపోయారు దంపతులు. అంత ఎత్తు నుండి చూస్తుంటే మిగిలిన వాళ్ళంతా—అపర్ణతో సహా—చీమలూ దోమలూలాగ కనిపించారు వాళ్ళకి..

అయితే ఆరునెలలు గడిచాక జరిగిన ఒక సంఘటనని ఏ పత్రికా ప్రచురించలేదు.

అనిత ఆత్మహత్య చేసుకుంది.

సరిగ్గా—ఆరాధ్య రచయిత రాసిన నవలలో నాయిక చేసుకున్న పద్ధతిలోనే ఆత్మహత్య చేసుకుంది.

అందుకు కారణం—

పెళ్ళికాకముందే—తను అడిగిన వెంటనే తనతో హొటల్‌కి, సినిమాకి వచ్చేసి తను చేసిన చిలిపి చేష్టల్ని ప్రోత్సహించిన అనిత శీలం మీద అనుమానం కలిగి వేధించడం మొదలు పెట్టాడు అనిల్. అనిత ప్రాణప్రదంగా పెట్టె అడుగున దాచుకున్న ఉత్తరాలు తీసి చదివాడు. ప్రేమ పక్షులు రాసిన ఉత్తరాలు అవి!

అంతే.

శరీరం ఎదిగినా, వివేకం వికసించని అనితకు అయువుమూడింది!

ఆ వార్త విన్నాక అపర్ణ హృదయం కకావికలైంది.

ఆలోచనలు! ఆలోచనలు!

అనిత విషాదాంతానికి బాధ్యులెవరు?

కనిపించిన ప్రతి పత్రికా చదివేసి, వివేక శూన్యులై ఊహా లోకాల్లో హీరోహీరోయిన్‌లా ప్రవర్తించే పాఠకులా?

వారి మానసిక రుగ్మతని పెంచి పోషించి నాలుగు రాళ్ళ కోసం నానా చెత్తా ప్రచురించే పత్రికలా?

ఏదిరాస్తే మనిషి మనోవికాసానికి దోహదం చేస్తుందీ,ఏది రాస్తే పతనానికి దారితీస్తుందీ అనే విచక్షణా జ్ఞానం లేకుండా అడ్డమైన విషయాలు రాసే ఆరాధ్య రచయిత(త్రు)లా?

ఎవరు బాధ్యులు??

